సాక్షి
జగిత్యాల

శనివారం । 11 । మే । 2024



నర్సన్నకు మొక్కులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం రద్దీ నెలకొంది. భక్తులు తరలివచ్చి గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారలను దర్శించుకున్నారు.



ఘనంగా అక్షయ తృతీయ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అనిల్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో అ క్షయ తృతీయ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.0/28.0

వాతావరణం

వాతావరణం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాకు తేలికపాటి వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాల్లో ఈనెల 11 నుంచి 14 వరకు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 39–42 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 25–28 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ ఉదయం 68–79 శాతం, మధ్యాహ్నం 45–57 శాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. నైరుతి దిశ నుంచి ఈదురుగాలులు గంటకు సరాసరి 1–7 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని, 13,14 తేదీల్లో బలమైన ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్లను స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రంగా తరలించాలన్నారు. 48 గంటలు సైలెన్స్ పీరియడ్ పాటించాలని అభ్యర్థులకు తెలియజేయాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేయకుండా నిఘా వ్యవస్థ గట్టిగా పనిచేయాలని, డబ్బు, మద్యం పంపిణీ కాకుండా చూడాలని ఆదేశించారు. తనిఖీలు ముమ్మరం చేయాలని, పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద వసతులు కల్పించాలన్నారు. ఈనెల 12న సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలకు సామగ్రి అంతా చేరుకోవాలన్నారు. 13న ఉదయం మాక్‌పోల్ నిర్వహించి అనంతరం ప్రతి 2 గంటలకోసారి పోలింగ్ వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. పోలింగ్ అయిన అనంతరం స్ట్రాంగ్ రూమ్ వరకు ఈవీఎం యంత్రాల తరలింపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దివాకర, మధుసూదన్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించండి



విద్యుత్ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఈ సత్యనారాయణ

జగిత్యాలఅగ్రికల్చర్: వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కోరుట్ల రూరల్‌సెక్షన్ పరిధిలోని వెంకటాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను విద్యుత్ అధికారులతో కలిసి సందర్శించారు. సదరు సబ్‌స్టేషన్ పరిధిలో ఏప్రిల్‌లో పలుమార్లు కరెంట్ ట్రిప్ అవుతూ అంతరాయం కలగడంతో సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని లాగ్‌బుక్, వ్యాక్యుమ్, సర్క్యూట్ బ్రేకర్లతో పాటు, అంతరాయం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని లైన్లను సిబ్బంది పరిశీలించాలని, విద్యుత్ లైన్‌లాస్‌ను తగ్గించేందుకు అవసరమైన చోట స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. అయితే సబ్‌స్టేషన్ పరిధిలో మూడు ఫీడర్లకు గాను ఒకటే బ్రేకర్ ఉన్నందున అంతరాయం కలుగుతున్నట్లు అధికారులు తెలుపగా, వెంటనే అదనపు బ్రేకర్ ఏర్పాటు చేయాలని ఎస్ఈ ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏడీఈ నగేశ్‌కుమార్, కోరుట్ల ఏడీఈ ఆంజనేయరావు, ఏఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



భూషణరావుపేట కొనుగోలు కేంద్రంలో వర్షపు నీరు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అకాల వర్షం కురియడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. కొందరి రైతుల ధాన్యం తూకం వేసి బస్తాల్లో నింపగా అవి తడవడంతో ఆరబెట్టేందుకు తంటాలు పడుతున్నారు. ధాన్యం కుప్పల్లో వర్షపునీరు చేరడంతో రంగు మారిందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.

సిరిసిల్ల జిల్లా ఉండాల్నా.. వద్దా?



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోకు హాజరైన జనం



మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్

- గోదావరి నీళ్లు రావాలంటే వినోద్‌కుమార్‌ను గెలిపించాలే..
- మన హక్కులు కాపాడుకోవాలంటే.. బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలవాలె..
- వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఎందుకు ఇస్తలేరో చెప్పాలె..
- ఇంకా మూడు రోజుల సమయం ఉన్నది ఆలోచించి ఓట్లు వేయాలె..
- సిరిసిల్ల రోడ్ షోలో బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు
- నేతన్నచౌక్ గులాబీమయం
- గులాబీ బాస్‌కు నీరా'జనం'

సిరిసిల్ల: 'దేవుని పేరుమీద ఉండాలని రాజన్నసిరిసిల్ల జిల్లాను చేసుకున్నాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల జిల్లాను తీసేస్తా అంటుండూ.. జిల్లా ఉండాల్నా వద్దా..?' అని బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ప్రశ్నించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి నేతన్నచౌక్‌లో రోడ్ షోలో ప్రసంగించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఉండాలంటే.. వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. గోదావరి నీళ్ల నర్మాల ఎగువమానేరుకు, మధ్యమానేరుకు రావాలన్నా.. మన హక్కులు కాపాడుకోవాలంటే.. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. మొన్ననే ప్రధాని నరేంద్రమోదీ వేములవాడకు వచ్చిండు.. దేవస్థానాన్ని బాగుచేస్తానని, ఒక్క మాటనన్నా చెప్పిండా.. అని ప్రశ్నించారు. ×సిరిసిల్ల చేనేత కార్మికులకు రూ.371కోట్లు బకాయిలు ఉన్నాయి.. ఈ ప్రభుత్వం కట్టమంటే కట్టకుండా నేతకార్మికులను పొవడాలు, నిరోధ్‌లు అమ్ముకోండంటే.. కోపం వచ్చి నేనోటి అంటే.. నా మీద 48 గంటల నిషేధం పెట్టారు..₹ కేసీఆర్ వివరించారు. తెలంగాణ రాక ముందు సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలు చూసి చలించి రూ.50లక్షలను తమ పార్టీ పరంగా తెచ్చి ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. నేతన్నల బతుకులు మార్చేందుకు బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాల ఆర్డర్లు ఇచ్చినం.. మరీ ఇప్పుడు అవన్నీ ఎటుపాయే అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు ఎందుకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వదని అడిగారు. నేతకార్మికులు అంటే.. అంత అలుసా అని ప్రశ్నించారు. పని లేక కార్మికులు ఇబ్బందులు పడుతుంటే.. ఆర్డర్లు ఇవ్వకుండా.. బకాయిలు ఇవ్వకుండా కార్మికుల బతుకులతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చర్చించి ఓటు వేయాలె..

ఇప్పుడు కీలక సమయమని, ఇంకా మూడు రోజుల సమయం ఉందని.. ఇంటికెళ్లి మీరంతా చర్చించి ఓటు వేయాలే.. అని కేసీఆర్ కోరారు. మరమగ్గాలు(పవర్‌లూమ్స్) బంద్ అయిపోయి, కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల కవులు, రచయితలు, మేధావులకు నిలయని, పెద్దింటి అశోక్‌కుమార్ లాంటి రచయితలు ఉన్నారని, అందరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. రైతుభరోసా ఎటుపాయే.. ధాన్యం కొంటలేరు.. కాంగ్రెస్ పాలనలో ఎన్ని గోసలు పడుతున్నమో.. మీరే చూస్తున్నారన్నారు. తెలంగాణ కోసం రాజీనామా చేస్తే.. రెండు లక్షల మెజార్టీ ఇచ్చి ఉద్యమాన్ని నిలబెట్టారని, ఈ కీలక సమయంలో అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు, ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వుచ్చిడి మోహన్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా, వేములవాడ బీఆర్‌ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీ నర్సింహారావు, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థపు మాధవి, బీఆర్‌ఎస్ నాయకులు గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సింగిల్‌విండో చైర్మన్లు, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల్లో జోష్

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షో సిరిసిల్లలో సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నిండింది. సిరిసిల్ల వీధుల్లో సాయంత్రం 5 గంటలకే గులాబీ కండువాలతో జనం నిండిపోయారు. బిల్డింగులపై జనం ఎక్కి కేసీఆర్ ప్రసంగాన్ని వినడం విశేషం.

గులాబీ బాస్‌కు నీరా'జనం'

సిరిసిల్ల కొత్త చెరువు కట్ట నుంచి జనం కేసీఆర్‌కు నీరాజనం పలికారు. బస్సుయాత్రలో భాగంగా శుక్రవారం 7 గంటలకు సిరిసిల్ల నేతన్న చౌక్‌కు కేసీఆర్ చేరుకున్నారు. కేసీఆర్ ప్రసంగిస్తుండగా.. జనం అరుపులు కేకలు రావడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కట్టడి చేశారు. కేసీఆర్ ప్రసంగం ముగించే దశలో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కలుగజేసుకుని జిల్లాను రద్దు చేసే అంశాన్ని గుర్తు చేశారు. దీంతో కేసీఆర్ జిల్లా ఉండాలా.. వద్దా అంటూ.. జనాన్ని ప్రశ్నించగా.. ఉండాలే అని జనం నుంచి స్పందన వచ్చింది. మాట్ల తిరుపతి, శిరీష కళాకారుల పాటలు, ఆటలు ఆకట్టుకున్నాయి. వెయ్యి మంది కళాకారులు సిరిసిల్ల వీధుల్లో కవాతు నిర్వహించారు. కళాకారులు బోనాలు ఎత్తుకుని, బతుకమ్మలతో, డప్పు వాయిద్యాలతో ఆకట్టుకున్నారు.



మంగళహారతులతో మహిళా నాయకులు



కళాకారుల ప్రదర్శన

చివరి శ్వాస వరకు ప్రజల కోసమే..

- ఆత్మీయతకు అహంకారానికి మధ్య పోటీ
- నేను కూడా లోకలే..
- షుగర్‌ఫ్యాక్టరీ తెరిపిస్తా
- నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా
- గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు
- 'సాక్షి'తో కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి



'నా చివరి శ్వాస వరకు నిజామాబాద్ ప్రజల కోసమే పనిచేస్తా. అహంకారానికి, ఆత్మీయత మధ్యే ఈ పోరు. ఇందూరు సమస్యలపై ఢిల్లీలో పోరాటం చేస్తా. నేను కూడా హిందువునే. రామాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశా. కానీ, రాజకీయాలు చేయలేదు. గల్ఫ్ కార్మికులకు అండగా ఉంటూ వారిని ఆదుకుంటా' అని అన్నారు కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి. శుక్రవారం 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

– రాయికల్(జగిత్యాల)

ఎన్నికల్లో మీ ప్రచారం ఎలా కొనసాగుతుంది? ప్రజల నుంచి స్పందన ఏవిధంగా ఉంది?

ఈ ఎన్నికల్లో అహంకారానికి, ఆత్మీయతకు మధ్య పోటీ. ధర్మపురి అర్వింద్‌వి అహంకార మాటలైతే నాది ఆత్మీయతతో కూడిన అనుబంధం. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాలో మంచి స్పందన వస్తుంది. ఎక్కడికి వెళ్లినా ఆప్యాయంగా స్వాగతం పలుకుతూ వారి సమస్యలను వివరిస్తున్నారు.

ఎంపీగా గెలిస్తే నిజామాబాద్ సెగ్మెంట్‌కు ఎలాంటి అభివృద్ధి పనులు చేస్తారు?

ప్రజల ఆశీర్వాదంతో ఎంపీగా గెలిస్తే తిరుపతి–కరీంనగర్ మధ్య నడిచే రైలును నిజామాబాద్ వరకు పొడగిస్తాం. ముంబయ్ నుంచి నిజామాబాద్ మీదుగా కరీంనగర్‌కు నడిచే రైలు జగిత్యాలకు వచ్చేలా చూస్తాం. నిజామాబాద్‌ను స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేస్తా.ఈపీఎఫ్ కార్యాలయాలు, యూనివర్సిటీల ఏర్పాటుకు కృషి చేస్తా.

గల్ఫ్, బీడీ కార్మికులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువగా ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారు. వీరి కోసం కేరళ తరహాలో గల్ఫ్ సంక్షేమ బోర్డు, గల్ఫ్‌లో మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తాం. ఈ విషయంపై ముఖ్యమంత్రి స్పష్టంగా ఉన్నారు. బీడీ కార్మికుల కోసం ఈఎస్ఐ, ఎలాంటి ఆంక్షలు లేకుండా పెన్షన్లు మంజూరు చేస్తాం.

హిందూ వ్యతిరేకిగా మీపైన బురదజల్లడం కోసం బీజేపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై మీ కామెంట్?

నేను కూడా హిందువునే. ఒక నాయకునిగా అన్ని కులాలు సమానమే. కులాలతో ఏనాడూ రాజకీయం చేయను. జగిత్యాల జిల్లా విద్యానగర్‌లో రామాలయం, క్యాంప్‌లోని రామాలయ భూములు అన్యాక్రాంతమైతే పరిరక్షించా. అది ధర్మపురి అర్వింద్‌కు తెలియదా.? రాయికల్ మండలం అయోధ్య, తాట్లవాయిలోని రామాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశా. చేసే పనుల్లో భక్తిభావం ఉండాలి. కానీ ఏ పనులు చేయకుండా ఆరోపించడం వారి అవివేకానికి నిదర్శనం.

పసుపు, చెరుకు రైతులను ఏ విధంగా ఆదుకుంటారు?

నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని ధర్మపురి అర్వింద్ గత ఎన్నికల్లో మాయమాటలు చెప్పి పసుపు రైతులను మోసం చేశారు. అసలు పసుపు బోర్డు ఎక్కడ పెట్టారో స్పష్టత ఇవ్వాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెరుకు ఫ్యాక్టరీల పునరుద్ధరణకు రూ.43 కోట్లు విడుదల చేశాం. నేను ఎంపీగా గెలవగానే చెరుకు ఫ్యాక్టరీలను పునఃప్రారంభించడంతోపాటు రైతులకు క్వింటాల్‌కు రూ.20 వేలు గిట్టుబాటు ధర చెల్లించేలా కృషి చేస్తా.

నిజామాబాద్ సెగ్మెంట్‌లో మీరు నాన్‌లోకల్ అనే ఫీలింగ్‌ను బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు తీసుకువస్తున్నారు. దీనిపై మీ అభిప్రాయం?

నాన్‌లోకల్ ఫీలింగ్ అనగానే నవ్వొస్తుంది. ధర్మపురి అర్వింద్ కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఎలా పోటీ చేశారో గుర్తుచేసుకోవాలి. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో నేను కూడా ఉన్నానని ఇరువురు నాయకులు గమనించాలి.

బీజేపీ గెలుపునకు హిందువులు ఏకం కావాలి

- నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి అర్వింద్

మెట్‌పల్లి(కోరుట్ల): బీజేపీ గెలుపు కోసం హిందువులంతా ఏకం కావాలని ఆ పార్టీ నిజామాబాద్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద శుక్రవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే అయోధ్య రామ మందిరానికి తాళం వేస్తారన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడటం కేవలం బీజేపీతోనే సాధ్యమవుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని హిందువులంతా మోదీకి అండగా నిలవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, సీనియర్ నాయకులు చిట్నేని రఘు, దొనికెల నవీన్, గుంటుక సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్

జగిత్యాల: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ ముగింపు సమయానికి 48 గంటల ముందు నుంచి పోలింగ్ ముగిసే సమయం వరకు సైలెన్స్ పీరియడ్‌గా పాటించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కోరుట్ల, జగిత్యాల, పెద్దపల్లి పరిధిలోని ధర్మపురి సెగ్మెంట్ల పరిధిలో ప్రజాప్రాతినిత్య చట్టం 1951 సెక్షన్ 126 ప్రకారం 144 విధించబడుతుందని తెలిపారు. నగదు, బహుమతులు, మద్యం వంటి అసాంఘీక కార్యక్రమాలు నిర్వహించకూడదని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయరాదన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో ఫలితాలు ప్రభావితం చేసే వార్తలను మీడియాలో ప్రసారం చేయకూడదని పేర్కొన్నారు. 48 గంటల పాటు రాజకీయ నాయకులు ఎలాంటి ప్రసంగాలు, ప్రచారాలు చేయవద్దని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు వారి గమ్య స్థానాలకు వెళ్లిపోవాలన్నారు. రాజకీయ ప్రచారానికి సంబంధించిన బల్క్ మెసేజ్‌లను నిషేధించడం జరిగిందని వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచింది

- బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి(ధర్మపురి): మోసపూరిత ప్రకటనలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, నమ్మి ఓటేసిన పాపానికి ప్రజలను నట్టేట ముంచిందని బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం పెగడపల్లి మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఆ పథకాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు వస్తాయని నాలుగు నెలల పాలనలో నలభై ఏళ్ల నరకం చూపించిన పాపం కాంగ్రెస్‌దన్నారు. ప్రజలు ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా

బుగ్గారం(ధర్మపురి): అబద్ధపు మాటలతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఈశ్వర్ విమర్శించారు. బుగ్గారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు.

సేవకుడిగా మీ ముందుకు..

గొల్లపల్లి(ధర్మపురి): పెద్దపల్లి పార్లమెంట్ ప్రజల సేవకుడిగా మీ ముందుకు వస్తున్నా ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గొల్లపల్లి మండలంలో ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల సమస్యలను పరిష్కారం చూపించారన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మోసపోతే గోస పడుతం



పెగడపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): మోసపోతే గోస పడుతమని కొప్పుల ఈశ్వర్ అన్నారు. వెల్గటూర్ మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఆగర్భ శ్రీమంతుడు గడ్డం వంశీ, భూగర్భ కార్మికుడు ప్రజల కష్టాలు తెలిసిన ఈశ్వర్‌కు జరుగుతున్న ఈ పోటీలో ప్రజల మనిషి ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, రాజేశంగౌడ్, మల్లారెడ్డి, రమణారావు, మహేశ్, కరుణాకర్‌రావు, ఓరుగంటి రమణారావు, స్వామి, ప్రవీణ్‌రావు, లోకేశ్, వెంకన్న, నరేందర్ రెడ్డి, అంజి, వెంకటేశం, రవి, రాజశేఖర్‌గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

ధర్మపురి: బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓటేయ్యాలని ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలోని నంది కూడలి వద్ద కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యే, మంత్రిగా రూ.వేల కోట్ల అభివృద్ధి చేశానని వివరించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

రాయికల్(జగిత్యాల): బీఆర్‌ఎస్ నిజామాబాద్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అల్లీపూర్, అయోధ్య, ఉప్పుమడుగు గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. రెండు రోజుల్లో ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ముకీద్, నాగరాజు, చింతలపల్లి స్వప్న, తిరుపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజు, వంశీ, నవీన్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

దేశాభివృద్ధిలో వ్యవసాయ రంగం పాత్ర ఎనలేనిది

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ విలాస్ ఎ తొనపి

జగిత్యాలఅగ్రికల్చర్: దేశాభివృద్ధిలో వ్యవసాయ రంగం పాత్ర ఎనలేనిదని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ విలాస్ ఎ తొనపి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాలలో శుక్రవారం జరిగిన కళాశాల 12వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వాతావరణ మార్పులతో పాటు, తెగుళ్ల వంటి అనేక సవాళ్లు రైతులకు ఎదురవుతున్నాయని, వాటిని ఎదుర్కోవాల్సిన బాధ్యత నేటి వ్యవసాయ విద్యార్థులపై ఉందన్నారు. సాగులో ఆదాయం తగ్గుతుండటంతో రైతులు ఇతర వ్యాపకాల వైపు మొగ్గుచూపుతున్నారని, దీంతో దేశ ఆర్థికాభివృద్ధి, ఆహార సమతుల్యతలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ, సాగురంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులు అధ్యయనం చేసి రైతులకు వివరించాలన్నారు. దేశాభివృద్ధిలో వ్యవసాయ విద్యార్థులు కీలకం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కాలేజీ మ్యాగజైన్‌ను విడుదల చేశారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణ్‌భట్, స్టూడెంట్ ఎఫైర్ కన్వీనర్ డాక్టర్ మహేశ్‌రెడ్డి, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కళాశాల వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ విలాస్ ఎ తొనపి

క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు చేశామని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మాట్లాడారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే ప్రశాంత వాతావరణం కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు 2,247 మంది జిల్లా, కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ మండలానికి సీఐ స్థాయి అధికారితో ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, 97 రూట్ మొబైల్స్, 20 క్విక్ రియాక్షన్ టీమ్స్ క్యూఆర్‌టీ, స్ట్రయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 800 మంది హోం గార్డ్స్‌తో పాటు సీఐడీ, పోలీసులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను కూడా ఉపయోగిస్తామని వెల్లడించారు.



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

నగదు, మద్యం స్వాధీనం

జిల్లాలో ఇప్పటివరకు పోలీసు తనిఖీల్లో రూ.2,21,53,310 నగదు, రూ.14,43,015 విలువ గల 2,769 లీటర్ల మద్యం, రూ.67,45,011 విలువ గల ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. అలాగే రూ.90 వేల విలువ గల బంగారం, రూ.3,95,000 విలువ గల గంజాయి సీజ్ చేశామన్నారు. గతంలో ఎలక్ట్రోరల్ నేరాలకు పాల్పడినవారిని, అందులో సహకరించిన వ్యక్తులను బైండోవర్ చేశామని, రౌడీషీట్ కలిగిన వారిని కూడా ముందస్తుగా బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటివరకు జిలాల్లో నియమావళి ఉల్లంఘన కింద 6 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో 45 లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేసుకోవడం జరిగిందన్నారు.

పోలీసులకు ప్రజలు సహకరించాలి

ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన వారు స్థానికంగా ఉండరాదని, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాలవారు ఉండకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్పీ వినోద్‌కుమార్, డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైనర్లతో పనులు చేయిస్తే చర్యలు

సాక్షి స్పందన

మేడిపల్లి: మండల కేంద్రం లోని ఓ స్వీట్‌హౌజ్‌లో బాల కార్మికుడు పని చేస్తున్న వైనంపై ప్రచురించిన కథనానికి శుక్రవారం అధికారులు స్పందించారు. జగిత్యాల అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సురేంద్రకుమార్ తనిఖీ చేసి మైనర్‌ను గుర్తించినట్లు తెలిపారు. షాప్ యజమాని సురేశ్ చోయల్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు మేడిపల్లి ఎస్సై శ్యాంరాజు, అధికారులు తెలిపారు. మైనర్లతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిశీలన

ఇబ్రహీంపట్నం: ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఇబ్రహీంపట్నం, ఎర్దండి, బండలింగాపూర్ పోలింగ్ కేంద్రాలను శుక్రవారం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ బూత్‌ల్లో పోలింగ్ రోజు ఎలాంటి అల్లర్లు జరుగకుండ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంతంగా పోలింగ్ జరిగేటట్లు చూడాలని ఎస్సై అనిల్‌ను ఆదేశించారు.

రూ.1.85 లక్షల నగదు పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద శుక్రవారం పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో విస్తృత వాహనాల తనిఖీ చేపట్టగా మల్యాల మండలం రాంపూర్‌కు చెందిన చింతదప్పుల రాజవ్వ ఏలాంటి అనుమతి లేకుండా తీసుకెళ్తున్న రూ.1.30 లక్షలు సీజ్ చేశారు. జగిత్యాల అర్బన్ మండలం చిట్యాల అశోక్ ఏలాంటి అనుమతి లేకుండా తీసుకెళ్తున్న రూ.55 వేలను సీజ్ చేసి గ్రీవెన్‌సెల్‌కు అప్పగించారు.

బెల్ట్ షాపుపై దాడి

మల్యాల: మండలంలోని లంబాడిపల్లిలో బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. లంబాడి పల్లి గ్రామానికి చెందిన బల్కం గంగా మహేశ్ యాదవ్, బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు శుక్రవారంఎస్సై అబ్దుల్ రహీం అధ్వర్యంలో దాడి చేశారు.17 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

కథలాపూర్: భీమారం మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన అభిలాశ్ కథలాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 30 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మద్యం నిల్వ ఉంచితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వందశాతం పోలింగ్ లక్ష్యంగా..

జగిత్యాల: పోలింగ్ శాతం పెంపునకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాల వారీగా ప్రత్యేకాధికారులను నియమించడంతో పాటు ఓటు ప్రాముఖ్యత, విలువ తెలిపేందుకు ప్రజల్లో చైతన్యం వచ్చేలా అవగాహన కల్పించారు. నియోజకవర్గానికొక యూత్ పోలింగ్ కేంద్రం, దివ్యాంగుల, మహిళ పోలింగ్ కేంద్రాలు నియోజకవర్గానికి ఐదు చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన గ్రామాలను గుర్తించి అక్కడ పోలింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదర్శ కేంద్రాలతో పాటు, ప్రత్యేకంగా మహిళ కేంద్రం, యూత్ కేంద్రం, దివ్యాంగుల కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

యువ ఓటర్ల కోసం..

నియోజకవర్గానికి ఒక యూత్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో యువ ఓటర్ల పోలింగ్ శాతం పెంచేలా అధికారులు చూస్తున్నారు. ఈ కేంద్రంలో మొత్తం యూత్ స్టాఫ్‌తో పాటు, అంతా యువకులే ఉంటారు. ఆయా కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగానికి సంబంధించిన మహనీయుల సూక్తులు అక్కడ ప్రదర్శించనున్నారు.

మహిళలకు..

నియోజకవర్గానికి ఒక మహిళ, దివ్యాంగ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, పోలీసులు, సెక్యూరిటీ అందరూ మహిళలే ఉండనున్నారు. వీరికి ప్రత్యేక వసతులతో పాటు, కూర్చునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయనున్నారు.

దివ్యాంగులకు..

దివ్యాంగులకు సైతం ప్రత్యేకంగా బూత్‌ను ఏర్పాటు చేయనున్నారు. దివ్యాంగ అధికారులు, సిబ్బంది అందరూ వారే ఉండనున్నారు. ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతోనే అధికారులు ఇలాంటి చర్యలు చేపడుతున్నారు.

మహిళా పోలింగ్ కేంద్రాలు

రాయికల్ మండలం సింగరావుపేట, సారంగాపూర్ మండలం పెంబట్ల, జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట, అటవీశాఖ కార్యాలయం, నర్సింగ్ కళాశాల ధరూర్‌క్యాంప్.ధర్మపురి మండలం నేరెళ్ల, గొల్లపల్లి మండలం ధట్నూర్, ఇబ్రహీంనగర్, బుగ్గారం మండలం చిన్నాపూర్, పెగడపల్లి మండల కేంద్రం.

మోడల్ పోలింగ్ కేంద్రాలు

రాయికల్ మండలం అల్లీపూర్, జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, బీర్‌పూర్ మండలం షెడ్యూల్డ్ వెల్ఫేర్ స్కూల్, జగిత్యాల అర్బన్ మండలం ఉమెన్స్ కళాశాల, ఖిలాగడ్డలోని ఉర్దూ ప్రైమరీ స్కూల్, కోరుట్ల, కోరుట్ల మండలం గుమ్లాపూర్, మెట్‌పల్లి మండలం వేంపేట, మెట్‌పల్లి పట్టణం, మెట్‌పల్లి ఎంపీడీవో ఆఫీస్. ధర్మపురి మండలం దోనూర్, వెల్గటూర్ మండల కేంద్రం, ధర్మపురి మండల పరిషత్ స్కూల్, ధర్మపురి మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, గొల్లపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల.

వికలాంగుల పోలింగ్ కేంద్రాలు:

కోరుట్ల మండల పరిషత్ కార్యాలయం, జగిత్యాల జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్, ధర్మపురిలోని ప్రభుత్వ పాఠశాల

యూత్ పోలింగ్ కేంద్రాలు..

మేడిపల్లి జిల్లా పరిషత్ స్కూల్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, జగిత్యాల, ధర్మపురి యూపీఎస్ స్కూల్‌లో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు



ప్రతి నియోజకవర్గానికి యూత్, దివ్యాంగ కేంద్రాలతో పాటు, ఐదు మహిళ, ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో యూత్ బూత్‌లో యువ సిబ్బంది, మహిళ బూత్‌లో మహిళా సిబ్బంది, దివ్యాంగుల బూత్‌లో వారే ఉంటారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాం.

– యాస్మిన్ బాషా, కలెక్టర్

నా బలం.. బలగం జగిత్యాల ప్రజలే

- కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



చల్‌గల్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: 'నా బలం.. బలగం జగిత్యాల ప్రజలే. మీ రుణం తీర్చుకునేందుకు అవకాశం ఇవ్వాలి' అని కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి కోరారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్, మోరపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మాట తప్పకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. ఐదేళ్లలో ఎంపీ అర్వింద్ చేసిందేమీ లేదన్నారు. రాముడిపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న భక్తి బీజేపీకి లేదని, 50 ఏళ్ల క్రితమే నిర్మించిన పోచంపాడ్ ప్రాజెక్ట్‌కు శ్రీరామ్‌సాగర్ పేరు పెట్టామని గుర్తుచేశారు.

ఎంపీగా అర్వింద్ ఏం చేశారు?

రాయికల్: నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్ జగిత్యాల జిల్లాకు ఏం చేశాడని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని అల్లీపూర్, అయోధ్య, రాయికల్, రామాజీపేట, ఒడ్డెలింగాపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. కేవలం మతరాజకీయాలు చేయడం అర్వింద్‌కు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి ఆరుగ్యారెంటీలు దశల వారీగా అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. అల్లీపూర్‌ను మండలంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మహేశ్, మాజీ జెడ్పీటీసీ గోపి మాధవి, జున్ను రాజేందర్, జితేందర్‌రావు, అత్తినేని గంగారెడ్డి, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో అలసిపోయా..

సారంగాపూర్(జగిత్యాల): 'జీవితంలో అలసిపోయా.. మొన్నటి ఎన్నికల్లో దేవుడు నాపై చిన్న చూపు చూశాడు.. మీ దయతో నన్ను ఈ సారి గెలిపిస్తే పార్లమెంట్‌కు పోతా.. మళ్లీ ఓడిపోతే తట్టుకునే శక్తి నాకు లేదు అంటూ తీవ్ర ఉద్వేగానికి లోనైన జీవన్‌రెడ్డి తన ఎన్నికల ప్రసంగాన్ని కొనసాగించారు. శుక్రవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా మీకు సేవచేస్తూనే ఉన్నానన్నారు. తనను ఓడించడానికి బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి కుట్రలు పన్నుతున్నాయని, వాటిని తిప్పికొట్టి ఈ ఒక్కసారి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీలు మసర్తి రమేశ్, కొల జమున, జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్లు పొల్సాని నవీన్‌రావు, ఏలేటి నర్సింహ్మారెడ్డి, గుర్నాథం మల్లారెడ్డి, పార్టీ అధ్యక్షుడు జితేందర్, రాంచందర్‌రెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు, మసీదుల వద్ద ఎమ్మెల్యే ప్రచారం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కోరుట్ల/కోరుట్ల రూరల్: పట్టణంతో పాటు మండలంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని సంగెం, నాగులపేట గ్రామాల్లో ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో చేసిన అబివృద్ధి, సంక్షేమం చూసి పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బాజిరెడ్డి గోవర్దన్ ను గెలిపించాలన్నారు. పట్టణంలోని మసీదుల వద్ద ముస్లింలను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ పట్టన, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేష్, చీటి వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.

బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మెట్‌పల్లి: నిజామాబాద్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు.మెట్‌పల్లి పట్టణంలోని ప్లంబర్ సంఘ సభ్యులను శుక్రవారం కలిసిన ఆయన బీఆర్‌ఎస్‌కు మద్దతివ్వాలని కోరారు.

'కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మొద్దు'



అంబారిపేటలో ఓట్లు అభ్యర్థిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాలరూరల్: కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మొద్దని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం ధర్మారం, అర్బన్ మండలం అంబారిపేట, హస్నాబాద్, ధరూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులను అన్ని రంగాల్లో ఆదుకున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ బస్సుయాత్ర వల్లే ప్రభుత్వం దిగివచ్చి రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమచేస్తున్నారని పేర్కొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్‌రావు, నాయకులు బాలముకుందం, శంకర్, కుతుబుద్దీన్, గంగాధర్‌గౌడ్, ప్రభాకర్, లక్ష్మణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటితో ప్రచారం బంద్

జగిత్యాల: ఎన్నికల ప్రచారం శనివారంతో ముగియనుంది. దీంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఏ విధంగా ఓట్లు రాబట్టాలో వ్యూహాలు రచిస్తూ ద్వితీయ శ్రేణి నాయకులకు సూచిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రచార సరళిని అంచనా వేసుకుంటూ ప్రణాళిక వేసుకుంటున్నారు.

ప్రలోభపర్వానికి వ్యూహం

పోలింగ్ దగ్గపడుతున్న కొద్దీ ప్రధాన పార్టీల నాయకులు వ్యూహాలకు పదునుపెడుతున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి గతంలో మద్యం, డబ్బు ఎక్కువగా పంపిణీ చేసేవారు. ప్రస్తుతం నిఘా ఎక్కువగా ఉండటంతో ఇతర మార్గాలపై దృష్టి సారిస్తున్నారు. బూత్‌ల వారీగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా ఓటర్లు సైతం ఆలోచించి ఓటు వేస్తున్నారు. అన్ని పార్టీల వారు డబ్బులు పంపిణీ చేసినా ఎవరికి ఓటు వేయాలో వారికే వేస్తున్నారు.

'దొంగపనులు చేసేటోళ్లే కాంగ్రెస్‌లో చేరారు'

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఇసుక దందా, రైస్ మిల్, భూకబ్జాలు.. ఇలా దొంగపనులు చేసేటోళ్లే కాంగ్రెస్‌లో చేరారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కోమటికొండాపూర్, కోజన్‌కొత్తూర్, కేశాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, బర్థిపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అబద్ధాల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ అర్వింద్‌ను నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. ప్రధాని మోదీకి రామజపం తప్ప అభివృద్ధి తెలియదన్నారు. నిజామాబాద్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరత్‌రెడ్డి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతు జీవన్‌రెడ్డిని గెలిపించండి



గోధూర్‌లో మాట్లాడుతున్న నర్సింగరావు

ఇబ్రహీంపట్నం: నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని గోధూర్, వర్షకొండ గ్రామాల్లో ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కూలీలను ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ ఆరుగ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఫించన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.కార్యక్రమంలో టీజేఎస్ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొటగిరి వెంకటస్వామి, మాజీ జెడ్పీటీసీ సునిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు పొనకంటి వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

మల్లాపూర్: పట్టణాలు, గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. మండలంలోని వాల్గొండలో శుక్రవారం ఉపాధి కూలీలను కలిసి ప్రచారం చేశారు. రాబోయే ఎన్నికల్లో జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలుపించాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే బీజేపీ ఎజెండా



ఇటిక్యాలలో ప్రచారం చేస్తున్న శ్రావణి

రాయికల్: అభివృద్ధి, సంక్షేమమే బీజేపీ ఎజెండా అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. మండలంలోని ఇటిక్యాల, భూపతిపూర్ గ్రామాల్లో శుక్రవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.ఎంపీగా ధర్మపురి అర్వింద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, సింగిల్‌విండో చైర్మన్లు ముత్యంరెడ్డి, మహిపతిరెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కుంట రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి మరోసారి అవకాశం ఇవ్వండి

సారంగాపూర్: మరోసారి దేశంలో మోదీ పాలన రావడానికి ప్రజలు బీజేపీకి ఓటేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. శుక్రవారం మండలంలోని రేచపల్లిలో ఉపాధిహామీ కూలీలను ఓట్లు అభ్యర్థించారు. ఆమె వెంట బీజేపీ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

'వికసిత భారత్' బీజేపీతోనే సాధ్యం

మల్లాపూర్: 'వికసిత భారత్' బీజేపీతోనే సాధ్యమవుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు కుస్తాపూర్, రత్నాపూర్, ముత్యంపేట గ్రామాల్లో శుక్రవారం ఉపాధి కూలీలను కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీని వాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలోనే డబుల్‌బెరూంలు నిర్మించిన ఘనత కేసీఆర్‌దే



అంతర్గాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకు పెద్ద ఎత్తున డబుల్‌బెరూంలు నిర్మించిన ఘనత కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం, ఒడ్డెరకాలనీ, లక్ష్మీపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా మాజీమంత్రి రాజేశంగౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ హయాంలో తండాలను గ్రామపంచాయతీలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీనివాస్, సునీత, నాయకులు కార్తీక్, రవీందర్‌రెడ్డి, నారాయణ, రాజిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, స్వామిరెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

ధాన్యం తరుగుతీయకుండా మిల్లులకు తరలించాలి

సారంగాపూర్: ధాన్యం తరుగుతీయకుండా మిల్లులకు వెంటనే తరలించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడారు. అకాల వర్షాలు కురుస్తున్నాయని రైతులు, అధికారులు సమన్వయంతో ధాన్యం తడవకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పలు గ్రామాల్లో ప్రచారం చేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కో రారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లిలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించారు. ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు అన్నదానం చేశారు. టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు మాధవచారి, రమణయ్య, రమాకాంత్, నర్సింహామూర్తి, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'వర్గీకరణ పేరుతో డ్రామాలు'

మల్లాపూర్: కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న మోదీకి ఎస్సీ వర్గీకరణ పూర్తి చేయలేదని ఎంఆర్పీఎస్ జాతీయ నాయకుడు బండపెల్లి రాజన్న మాదిగ ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఎంఆర్పీఎస్, మాదిగ, ఉపకూలాలు, కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ కుల, మతతత్వ పార్టీ అని, పదేళ్లు అధికారంలో ఉండి ఏ వర్గానికి చేసిందేమి లేదని దుయ్యబట్టారు. ఎంపీగా జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలుపించాలని కోరారు. సమావేశంలో కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాస్టిన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుద్దుల గంగనర్సయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

కథలాపూర్(వేములవాడ): కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశాభివృద్ధి జరుగుతుందని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. కథలాపూర్ మండలం ఊటిపెల్లి, భూషణరావుపేట, చింతకుంట గ్రామాల్లో శుక్రవారం బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్మల వినోద్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ధర్మపురి: కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని ఓయు జేఏసీ కో–ఆర్డినేటర్ దుర్గం మల్లేశ్ అన్నారు.పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం పెద్దపెల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సంక్షేమపథకాలు నిరుపేదలకు అందాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సీపతి సత్యనారాయణ, మల్లేష్ నేత, శ్రావణ్, దేవ, కోటేశ్ తదితరులున్నారు.



మరోసారి
మన మోదీ సర్కార్
నేను
పక్కా లోకల్...!
మీ బిడ్డగా మీ ఓటును కోరుతున్నా...
కరీంనగర్ గడ్డమీద పుట్టిన...
మానేరు నీళ్లు తాగి పెరిగిన...
మీ బిడ్డగా మీ కళ్లముందు ఎదిగిన...
ప్రజల కష్టాలు కళ్లార చూసిన...
మీ బాధలకు భాసటగా నిలిచిన...
మీ పక్షాన పోరాటాలను చేసిన...
ధర్మరక్షణే నా బాధ్యతగా భావించిన...
కాషాయ జెండానే నిత్యం మోసిన...
మీ ఆకాంక్షలకు వారధిగా నిలిచిన...
మీరు ఆశించిన అభివృద్ధిని చేసిన...
పోరాటాల మట్టిలో ఉన్న మహిమ బలమో...
నిండుమనస్సుతో మీరు నన్ను
దీవించిన దీవెనల ఫలమో..
మహాశక్తి అమ్మవారి అనుగ్రహమనే
ఆశీస్సుల పుణ్యమో... నేను పుట్టిపెరిగిన గడ్డకు
సేవ చేయాలనే సంకల్పమో..
నిరంకుశ, నియంతల అంతమే నా పంతం అయింది.
రజాకార్లను ఎదిరించిన ఈ గడ్డ పౌరుషమే
నా కంఠ స్వరంగా మారింది. ఉగ్గుపాలతో నేర్చుకున్న
పోరాటమనే బలం నాకు అండగా నిలబడింది.
జన్మనిచ్చిన గడ్డకు సేవచేయడమే
నా ధ్యేయం అయింది.
నా ధైర్యం మీది. నా ప్రాణం మీది.
నా పోరాటం మానేరు నీళ్ల తెగువది
నాకీర్తి కరీంనగర్ ప్రజలది
భారత్ మాతాకీ జై
Ready
Ballot Unit
1 బండి సంజయ్ కుమార్ BANDI SANJAY KUMAR
2
3
4
5
6
కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగా
భారతీయ జనతా పార్టీ అభ్యర్థి
శ్రీ బండి సంజయ్ కుమార్
గారిని అత్యధిక మెజారిటీతో గెలిపిద్దాం
కమలం పువ్వు గుర్తుకే మన ఓటు
పోలింగ్ తేది : 13 మే, 2024
ఉ॥ 7 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు